ప్రజాశక్తి
శుక్రవారం 31 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



నేడు చిరు ధాన్యాల మహోత్సవం

ప్రజాశక్తి -కలెక్టరేట్

చిరు ధాన్యాల మహోత్సవాన్ని శుక్ర వారం నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయ ఆవరణలో చిరు ధాన్యాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవంలో చిరు ధాన్యాలు, విత్తనాలు, చిరు ధాన్యాలతో తయారు చేసిన బిస్కెట్లు, వివిధ రకాల సాంప్రదాయ ఆహార పదార్థాలను ప్రదర్శించడం, విక్రయించడం జరుగుతుందని ఆయన వివరించారు. చిరు ధాన్యాల మహోత్సవం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంలో భాగంగా దీన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

- నిన్న టిడిపి... నేడు వైసిపి
- గిరిజనులకు నమ్మక ద్రోహం చేస్తున్న పార్టీలు
- బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ తీర్మానం

నేడు మన్యం బంద్



కురుపాంలో ప్రచారం చేస్తున్న ఎపి గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - సాలూరు/గుమ్మలక్ష్మీపురం

రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజనులను మోసం చేయడానికి ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. నమ్మకద్రోహం చేస్తూ కపట నాటకాలు ఆడుతున్నాయి. రాష్ట్రంలో ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన బిసి తెగలు బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ ఇటీవల అసెంబ్లీలో వైసిపి ప్రభుత్వం తీర్మానం మన్యం ప్రాంతాల్లో వివాదాస్పద మవుతోంది. గతంలో ఎపి రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీకి లభించనంత మద్దతుని గత ఎన్నికల్లో వైసిపికి గిరిజనులు అందజేశారు. ఏడు గిరిజన నియోజకవర్గాల్లోనూ వైసిపి అభ్యర్థుల విజయానికి గిరిజనులు సహకరించారు. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు అధికార పార్టీ బోయ, వాల్మీకిలను గిరిజనుల జాబితాలో చేర్చాలని కోరుతూ తీర్మానాన్ని కేంద్రానికి పంపించడం గిరిజనుల్లో ఆగ్రహావేశాలకు కారణమవుతోంది. రాజ్యాంగం ప్రకారం గిరిజనుల్లో ఉన్న 33తెగలు ఇప్పుడు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో 6.5శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా గిరిజన, ఆదివాసీల్లో తీవ్ర వెనుకబాటుతనం ఉంది. ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. కనీస రహదారి, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేక ఏటా వేలాది మంది గిరిజనులు బతుకు తెరువు కోసం వలసబాట పడుతున్నారు. ఇప్పటికీ గిరిజనుల్లో ఉన్నత విద్య అభ్యసించిన వారిని వేళ్లమీద లెక్క పెట్టవచ్చు. పదోతరగతి, ఇంటర్ వరకు చదివిన వారు, చదువు మధ్యలోనే ఆపేసిన గిరిజన యువకులు లక్షల్లో వున్నారు. ఇంకా మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు వారి వెనుకబాటుతనానికి అద్దం పడుతున్నాయి. గిరిజన రైతులు సేకరించిన అటవీ ఉత్పత్తులకు, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు అందని ద్రాక్షలా ఉన్నాయి. గిరిజన సంతల్లో దళారీల చేతుల్లో గిరిజనులు మోసపోతూనే ఉన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి అందుతున్నా వారి జీవన పరిస్థితుల్లో మార్పు తేవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావిధానంతో చాలా గిరిజన గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. 10 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలల మూసివేయడంతో గిరిశిఖర గ్రామాల్లో పిల్లలు చదువుకు దూరమయ్యారు. రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో పాఠశాలలున్నా ఉపాధ్యాయులు నెలకోసారి కూడా వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పడిన జిసిసి, ఐటిడిఎ లాంటి సంస్థలు ఆర్థికంగా దివాళా తీసిన పరిస్థితిలో ఉన్నాయి. ఇంతటి తీవ్రమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనం ఎదుర్కొంటున్న గిరిజనులతో సమానంగా వారి కోటాలో బోయ, వాల్మీకిలను చేర్చడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన బోయ వాల్మీకిలను ఎస్టీల్లో చేరిస్తే ఇప్పుడున్న గిరిజన తెగలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. తాము నమ్మి గెలిపించుకున్న ప్రభుత్వాలే తమకు ద్రోహం చేస్తున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గిరిజన ప్రయోజనాలను పెణంగా పెట్టడంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గిరిజన సంఘాలు శుక్రవారం మన్యం బంద్‌కు పిలుపు నిచ్చాయి.

తొలి తీర్మానం టిడిపిదే

2014 నుంచి 2019వరకు టిడిపి రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు తొలిసారిగా గిరిజనుల అభీష్టానికి వ్యతిరేకంగా అప్పటి ప్రభుత్వం తీర్మానం చేసింది. బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేరుస్తూ టిడిపి మొదటిసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. అప్పుడు ప్రతిపక్ష వైసిపితో సహా ప్రధాన రాజకీయ పార్టీలు, గిరిజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అయితే అప్పుడు కూడా గిరిజనులు వైసిపికి అండగా నిలిచారు. 2014 ఎన్నికల్లో టిడిపి ఏడు ఎస్టీ నియోజకవర్గాల్లో ఒకే ఒక్క నియోజకవర్గంలో విజయం సాధించింది. ఆరు స్థానాల్లో వైసిపి ఎమ్మెల్యేలు గెలిచారు. 2014 నుంచి ఇప్పటి వరకు గిరిజనులు వైసిపినే ఆదరిస్తున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో గిరిజన ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కలేదు. చివరి ఏడాదిలో గిరిజన ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఇచ్చింది. టిడిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో గిరిజనుల కోసం చెప్పుకోదగిన అభివృద్ధి ఒక్కటీ లేదు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చాలనే తేనెతుట్టెను టిడిపి మొదటిగా కదిపితే వైసిపి అదే దారిలో నడుస్తోంది. గిరిజనులకు నమ్మించి మోసం చేయడంలో టిడిపి, వైసిపి 'దొందూ దొందే' అన్నట్లు వ్యవహరిస్తున్నాయి.

గిరిజన ద్రోహులు టిడిపి, వైసిపి



బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెం బ్లీలో తీర్మానం చేయడం వల్ల గిరిజనులకు తీరని అన్యాయం జరుగు తుంది. ఆర్థికంగా, రాజకీయంగా ముందంజలో బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానించారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం కూడా అదే దారిలో నడిచింది. గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసిపి ఇలాంటి చర్యలకు పాల్పడడం దారుణం. టిడిపి ప్రభుత్వం తీర్మానించిన సమయంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న రాజన్నదొర తీవ్రంగా ప్రతిఘటించారు. ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారు? అధికారపార్టీ వైఖరికి నిరసనగా శుక్రవారం మన్యం బంద్‌ని ఇతర సంఘాలతో కలిసి విజయవంతం చేస్తాం.

సీదరపు అప్పారావు,
ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

బంద్ జయప్రదం చేయాలి



గిరిజన హక్కులు, చట్టాల రక్షణకు శుక్రవారం తలపెట్టిన మన్యం బంద్‌కు అన్ని వర్గాల ప్రజల మద్దతు తెలిపి జయప్రదం చేయాలి. గిరిజన, ఉద్యోగ సంఘాలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలి.

మండంగి రమణ
ఎపి గిరిజన సంఘం
జిల్లా గౌరవ అధ్యక్షులు

గిరిజన మంత్రి, ఎమ్మెల్యేల మౌనం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొరతో సహా ఏడుగురు ఎమ్మెల్యేలు వైసిపికి ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో సిఎం జగన్ మోహన్‌రెడ్డి బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ తీర్మానం చేసినప్పుడు వైసిపి ఎమ్మెల్యేలెవరూ కిక్కురుమనలేదు. ఇప్పటికీ నోరు మెదపకపోవడంపై గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు రగిలిపోతున్నారు. గిరిజన ప్రయోజనాల కోసం ఎస్టీ ఎమ్మెల్యేలంతా పదవులకు రాజీనామా చేయాలనే డిమాండ్ తెరపైకి తెచ్చారు. ఈ వ్యవహారంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు గానీ, డిప్యూటీ సిఎం రాజన్నదొర గాని, ఇతర కీలక పదవులు అనుభవిస్తున్న గిరిజన నాయకులు గాని కిమ్మనకుండా మౌనం వహిస్తున్నారు.

గిరిజనుల పట్ల వివక్ష తగదు



ప్రభుత్వాలకు గిరిజనుల పట్ల వివక్ష తగదు. తమ స్వార్థ రాజకీయాల కోసం, ఓట్లు దండుకునే పనిలో భాగంగా గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను నాశనం చేసేందుకు పూను కున్నాయి. గిరిజన ల హక్కులు రక్షణకై పూర్తి స్థాయిలో ఉద్యమిస్తాం. తీర్మానాన్ని రద్దు చేయాల్సిందే.

కోలక అవినాష్
ఎపి గిరిజన సంఘం రాష్ట్ర
కార్యవర్గ సభ్యులు



పార్వతీపురంలోని ఎంఎంసి గోడౌన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌పాండే

రైతు బజారును అభివృద్ధి చేయాలి

మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే

ప్రజాశక్తి - పార్వతీపురం/ కొమరాడ

రైతు బజారు అభివృద్ధి చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే అన్నారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు గురువారం విచ్చేశారు. పార్వతీపురంలో రైతు బజార్, వ్యవసాయ మార్కెట్ యార్డు, కొమరాడలో మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్‌ను పరిశీలించారు. రైతు బజారులో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతు బజారును ఇంకా అభివృద్ధి చేయాలని, అన్ని దుకాణాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు బజారులో వినియోగదారులు అధికంగా వచ్చేలా చేయాలని, తద్వారా రైతులకు ఆదాయం పెరుగుతుందని, అదే సమయంలో రైతు బజారు మరింత అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని ఆయన సూచించారు. రైతు బజారు రైతుల అభివద్ధికి దోహదం కావాలని ఆయన అన్నారు. కొమరాడలో రూ.40లక్షలతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ పరిశీలించిన కమిషనర్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని అన్నారు. డ్రైయింగ్ ఫ్లాట్ ఫారం, 60 మెట్రిక్ టన్నుల వేయింగ్ బ్రిడ్జిని త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శులతో మాట్లాడుతూ గత ఏడాది నిర్దేశించిన రూ.7.27 కోట్ల లక్ష్యాలకు గాను రూ.12 కోట్లు సాధించడంపై అభినందించారు. లక్షాలను సాధించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌జెడి పి.సుధాకర్, డిడి ఎస్.యర్రన్న, వ్యవసాయ మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్.అశోక్ కుమార్, విజయనగరం జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి శ్యామ్ కుమార్, పర్యవేక్షకులు సుధీర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామకం రద్దుచేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జియ్యమ్మవలస మండలం ఆర్‌ఆర్‌బి పురం గిరిజన సంక్షేమ ఆశ్రమ హైస్కూల్లో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న సిహెచ్ సాంబమూర్తిని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కురుపాంకు నియమించడం నిబంధనలకు విరుద్ధమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహనరావు తెలిపారు. నిబంధనల ప్రకారం ఎస్జీటీ స్కేల్‌లో ఉన్న ఆశ్రమ పాఠశాల టీచర్లను నియమించాలి. కానీ అతను స్కూల్ అసిస్టెంట్ క్యాడర్లో పనిచేస్తున్నాడు. గతంలో ఈ నియమాకాన్ని యుటిఎఫ్ అడ్డుకొని అప్పటి అధికారులు అవినీతికి పాల్పడి నియమించాలని ప్రయత్నించారని అప్పటి వరకు పిఒ స్పందించి నియామకాన్ని నిలిపివేయాలని కోరారు. 2014 నాటి ట్రిబ్యునల్ ఉత్తర్వులు అనుసరించి చేశామని డిడి చెబుతున్నారని, ఆనాటి ఉత్తర్వులు ఇప్పుడు చేయడమేమిటని అన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు పనిచేసేందుకు సీనియర్ ఎస్‌జిటి ఉపాధ్యాయులు చాలామంది అప్లికేషన్ పెట్టుకున్నారని, కానీ వాటిని పక్కనపెట్టి స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టులో పనిచేస్తున్న వ్యక్తికి ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ నియామకంలో భారీగా అవినీతికి గిరిజన సంక్షేమాధికారి పాల్పడ్డారని, పిఒను తప్పుదోవ పట్టించి ఉత్తర్వులు ఇచ్చారని అన్నారు. ఈ అక్రమ నియామకాన్ని రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమస్యల్లో 'ఈత'మానుగూడ

- కాలువల్లేక రోడ్లపైనే మురుగునీరు
- పదేళ్ల నుంచి విద్యుత్తుకు నోచని ఎగువడుంబంగివలస, గూడంగి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన పంచాయతీ పివి ఈతమానుగూడ కొట్టుమిట్లాడుతోంది. ఈ పంచాయతీలో సుమారు 900 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో పివి ఈతమాను గూడ, పుట్టిగాం, గురండి, డుంబంగివలస, చావిడి వలస, నెల్లి గండి తదితర 10 గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీని పాలకులు, అధికారులు పట్టించుకోక అభివృద్ధికి ఆమాడు దూరంలో ఉంది. పంచాయతీ పరిధిలో వీధి కాలువలు లేక మురికి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో గిరిజనులు అనారోగ్యం పాలవుతున్నారు. అలాగే తాగునీటి సమస్య వెంటాడుతుంది అధికారులకు సమస్య విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదని 'ప్రజాశక్తి' వద్ద వారు వాపోయారు. పక్కా గృహాల్లేక పాత రేకులు, పురిపాకలోనే ఈ గ్రామాల్లో దర్శమిస్తున్నాయి. ఈ పంచాయతీకి కేవలం 12 జగనన్న ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. వీటికి కూడా ప్రభుత్వం అరకొరగా ఇచ్చిన నిధులు వేటికీ చాలకపోవడంతో గోతులకే పరిమితమయ్యాయి, పుట్టిగాం, గురండి డుంబంగివలస, ఈతమానుగూడ, నెల్లిగండి గ్రామాలకు వరద గోడల్లేక వరదనీరు ఇంటి లోపలికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అర్హులైన వృద్ధులకు పింఛన్లు అందడంలేదు. ఇప్పటికీ ఈ పంచాయతీలో ఎటువంటి రుణాలందక ఆర్థికంగా గిరిజనులు వెనకబడి ఉన్నారు. పదో తరగతి పాసైనవాళ్లు ఫెయిల్ అయిన యువతకు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎగువడుంబంగివలస, గూడంగిలో తిత్లీ తుఫాను సమయంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి వైర్లు తెగి పడిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రెండు గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం లేక గిరిజనులు చిమ్మ చీకట్లోనే జీవనం సాగిస్తున్నారు. ఇంతవరకు అధికారులు పట్టించుకోక లేదంటే ఈ పంచాయతీ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



పూరిళ్లు, రేకిళ్లతో దర్శనమిస్తున్న ఈతమానుగూడ

సమస్యలను అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు

ఎగువడుంబంగివలస, గూడంగిలో విద్యుత్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. తితిలి తుఫాన్ సమయంలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. అప్పటి నుంచి విద్యుత్ లేదని అధికారులకు చెప్పాం. అయినా నేటికీ పట్టించుకోలేదు. దీంతో పాటు పంచాయతీలో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ఒక సమస్య కూడా పరిష్కారం కాలేదు.

పత్తిక వీరన్న,
సర్పంచ్ పివి ఈతమానగూడ పంచాయతీ.

కాలువల్లేక ఇబ్బందులు పడుతున్నాం

గ్రామాల్లో కాలువల్లేక మురికినీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వర్షం నీరు కూడా రోడ్డుపైనే ఉంటుంది. ఇప్పటికే కాలువలు, జగనన్న గృహాల బిల్లులు గురించి అధికారులకు తెలియజేశాం. అయినా పట్టించుకోలేదు.

పత్తిక లింగరాజు,
పివి ఈతమానుగూడ.

సీతారాముల కల్యాణోత్సవం

శోభాయమానం

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బొత్స దంపతులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

శ్రీరామనవమి సందర్భంగా రామతీర్థంలో సీతారాముల కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు స్వామి వారి కల్యాణానికి ముత్యాల తాలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. గోటి తో వొలిచిన 28 కేజీల తలంబ్రాలను కల్యాణానికి వినియోగించారు. టిటిడి నుండి, సింహాచలం నుండి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిగింది. ప్రముఖ పండితులు మైలవరపు శ్రీనివాస రావు వ్యాఖ్యానం ఆద్యంతం సందేశాత్మకంగా నిలిచింది. 40మంది ఋత్వికులు, అర్చకులు శ్రీమద్రా మాయణ పారాయణం, సుందరకాండ పారాయణం, సుందర కాండ విశేష హవనం, దివ్య ప్రబంధ సేవా, శత సహస్ర నామ తులసీ దళార్చన, కుంకుమార్చన, ఆరాధన, బాల భోగం, తీర్థ గోష్ఠి, రామచంద్ర స్వామి అవతార సర్గ విన్నపం నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణులను ప్రత్యేక వాహనంలో దేవస్థానం కల్యాణ మండపంలో కి తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణం మహోత్సవాలు ప్రారంభించి కంకణ ధారణ, జీలకర్ర బెల్లం, గోటి తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాలు కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం 12గంటలకు సీతారాముల కళ్యాణాన్ని అర్చకులు జరిపించారు.

కల్యాణోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, నెలిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, పద్మావతి దంపతులు, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు. తొల్లుత జె.సి. మయూర్ అశోక్, ఆర్‌డిఒ సూర్య కళ, దేవస్థానం ఇఒ కిశోర్ తదితరులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి వేదం మంత్రాలతో మంత్రిబొత్స, ఎమ్మెల్యే, జిల్లా జడ్జి కల్యాణ చక్రవర్తిని దేవాలయంలో సీతారాముల దర్శనానికి తీసుకు వెళ్లారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద జరిగిన వేడుకలో పాల్గొన్నారు.

అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ఈ ప్రభుత్వం పైనా, రాష్ట్ర ప్రజలందరి పైనా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రామతీర్థం మరో భద్రాచలంగా చెప్పుకోవచ్చునని, భద్రాచలంలో మాదిరిగానే ఇక్కడా అలాంటి సంప్రదాయంతో కళ్యాణోత్సవాలు నిర్వహించడం సంతోషాదాయకంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పైడితల్లి దేవస్థానం ఇఒ సుధారాణి, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, మున్సిపల్ కమిషనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగానశ్రీని వాస రావు, ఎంపిడిఒ తహశీల్దార్, నగర పంచాయితీ ఛైర్మన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, మాజీ ఎంపిపి మత్స విజయ, నాయకులు మత్స సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణం సందర్భంగా తాళి బొట్టు చూపిస్తున్న అర్చకులు



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మి దంపతులు

వైసిపికి మరిశర్ల గుడ్‌బై

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక మున్సిపాలిటీలో వైసిపికి గట్టి దెబ్బతగిలింది. వైసిపి సభ్యత్వానికి, కౌన్సిలర్ పదవికి 21వ వార్డు కౌన్సిలర్ మరిశర్ల రామారావు నాయుడు రాజీనామా చేశారు. సాహితీ నగర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ఆవిర్భావానికి నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, సిఎం జగన్మోహన్ రెడ్డితో కలిసి పని చేసినప్పటికీ తనకు తగిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నేడు పార్టీకి దూరమవుతున్నానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు ఏపార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీలో చేరుతారని పరోక్షంగా విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు సాహితీనగర్‌లో భారీ బహిరంగ సభ పెట్టి నియోజకవర్గంలో మంచి ఊపు తీసుకువచ్చామని చెప్పారు. 2019 ఎన్నికల్లో వైసిపి విజయానికి కష్టపడి పనిచేసినా గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 21వ వార్డు సమస్యలను ప్రస్తావిస్తే పట్టించుకోలేదన్నారు. బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల్లో అత్యధిక సభ్యత్వం చేయడంతో అప్పట్లో భూమా నాగిరెడ్డి అభినందించారని గుర్తుచేశారు.

విద్యుత్తు తీగలపై విరిగిపడ్డ చెట్లు

కరెంటు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో మార్కొండపుట్టి సమీపంలోని కవిరివలసలో విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా శుక్రవారం మార్కొండపుట్టి ఫీడర్ పరిధిలోని చెట్లు నరకడం కార్యక్రమం ఉండడంతో మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని బొబ్బిలి ట్రాన్స్‌కో ఎఇ సి.హరి తెలిపారు. దీంతో మార్కొండపుట్టి, మగ్రివానివలస, తెలగడవలస, బట్టివలస, కవిరివలస, కాకులవానివలస, శిబిల్లి, వీరడవలస, పెద్ద గైసిలా, నంద, కత్తుల గైసిలా, గుడిగైసిలా, కేంద్రుగైసిలా మొదలగు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుందన్నారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.


శ్రీరాముడి విగ్రహానికి వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒ తీరుమార్చరూ..

పార్వతీపురంరూరల్ : స్థానిక ఎంఇఒ ప్రసాద్ పక్షపాతధోరణి, వివక్షతా వైఖరి మార్చాలని శ్రీరామనవమి సందర్భంగా యుటిఎఫ్ నాయకులు శ్రీరాముని విగ్రహానికి వినతి అందించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గురువారం పట్టణానికి చెందిన అగ్రహారం వీధిలోని రామమందిరంలోని రాముని విగ్రహానికి వినతి అందించిన అనంతరం వారు మాట్లాడారు. ఎంఇఒ వైఖరిపై గత కొద్దిరోజులుగా ఆందోళనలు చేపడుతున్నప్పటికీ అధికారులు ఆయన పై చర్యలు తీసుకోలేదని అన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో మరేదిక్కులేక, దేవునికి వినతి సమర్పించామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.మురళీమోహనరావు, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, పి.వెంకటినాయుడు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.జగన్నాథం, వి.వసంతనాయుడు పాల్గొన్నారు.

కురుపాం విద్యార్థుల ప్రతిభ

కురుపాం : చిరుధాన్యాలపై డివిజన్, జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.స్వప్నిక 9వ తరగతి విద్యార్థిని ద్వితీయ స్థానం , కె. లక్ష్య 8 వ తరగతి విద్యార్థి తృతీయ స్థానం లో నిలిచి బహుమతులు పొందినట్లు ప్రధాన ఉపాధ్యాయులు టి. శంకరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల పేరు ప్రతిష్టలు జిల్లా స్థాయిలో నిలిపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించినట్లు తెలిపారు.


సోలార్ రక్షిత ట్యాంక్ పరిశీలిస్తున్న సిఐ సత్యనారాయణ


గిరిజన గ్రామాల్లో సిఐ పర్యటన

గుమ్మలక్ష్మీపురం : ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ గురువారం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాలైన వంగర, కేసర, డోలుకొన, కేసరి గూడ, సందిగూడ తదితర కొండ శిఖర గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులతో సమావేశాలు నిర్వహించి, వారి సమస్యలైన కనీస మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన నిరుద్యోగ యువతను కలిసి వారికి ఉద్యోగ, ఉపాధి కల్పన శిక్షణ కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ మేరకు తాను సేకరించిన వివరాలను తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్ఐ షణ్ముఖరావు పోలీస్ సిబ్బంది ఉన్నారు.


కోనేరు పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు

కోనేరు పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని పెదబోగిలి పంచాయతీ పరిధిలో గల అప్పయ్యపేటలో కోనేటి పనులను గురువారం సర్పంచ్ జొన్నాడ తేరేజయమ్మ, గరికయ్య పరిశీలించారు. ఉపాధిహామీ చట్టంకింద కోనేటి పనులు పూర్తి చేసి మంచినీరు ఉపయోగించేలా చూడాలన్నారు. పంచాయతీలో అన్ని పంచాయతీ అన్ని పనులు చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పరిశీలనలో ఎంపిటిసి సభ్యులు బురిడీ కుసుమ సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి సభాను శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ చింతాడ సత్యం తదితరులు పాల్గొన్నారు.


రాంబాబు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాంబాబు కుటుంబానికి ఆర్థిక సాయం

వీరఘట్టం: మండలంలోని నీలా నగరం గ్రామానికి చెందిన అక్కివరపు రాంబాబు కుటుంబానికి గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆర్థిక సహాయం అందించారు. రాంబాబు పెయింటింగ్ వర్క్ చేస్తూ ప్రమాదస్తు గాయపడిన కారణంగా ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన రూ 60వేల చెక్కును మెరుగైన వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తం నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'దేశానికి మోదాని ముప్పు' పుస్తకావిష్కరణ

బొబ్బిలి: దేశానికి మోదాని ముప్పు పుస్తకాన్ని స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, మండల నాయకులు ఎస్.గోపాల్, బి.చిరంజీవి, గోపి, కె.మణికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.శంకరరావు మాట్లాడుతూ ప్రధాని మోడీ దన్నుతో అదాని దేశంలో ప్రతి అంగుళాన్ని సొంతం చేసుకోవడానికి కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ప్రకృతి వనరులను కైవశం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోనూ సిఎం జగన్ అండగా రాష్ట్ర సంపదపై కన్నేశారని తెలిపారు. అదాని వజ్రాల వ్యాపారంతో మొదలై, మోడీ దన్నుతో అవినీతి, మోసాలకు పాల్పడి, ప్రపంచ కుబేరుల్లో ఒకడిగా ఎలా ఎదిగాడో ఈ పుస్తకంలో ఆర్థికవేత్తలు రాశారని, ప్రతిఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని కోరారు.

24 గంటల్లో కోలుకున్న పక్షవాత రోగి

బొబ్బిలి : పక్షవాతం బారిన పడిన పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కె.సూరమ్మ 24గంటల్లో కోలుకుంది. ఈనెల 28న ఉదయం 11గంటల సమయంలో పక్షవాతం బారిన పడడంతో ఎడమ చెయ్యి, కాలు పూర్తిగా పని చేయలేదు. మూతి వంకరై మాటలు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బొబ్బిలిలో ఉన్న నారాయణి హార్ట్ కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. రోగికి వైద్యులు పి.సునీల్ సిటీ స్కాన్ చేయించి మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించారు. మధ్యాహ్నం 3.30గంటల సమయంలో టెనెక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ చేయగా ఐదు గంటల్లో చెయ్యి, కాలు పని చేశాయి. 24గంటల్లో మూతి వంకర నయం అవ్వడంతో మాటలు బాగా ఆడడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పక్షవాతం వచ్చిన ఆరు గంటల లోపు ఆసుపత్రిలో చేరితే వ్యాధిని నయం చేయవచ్చునని వైద్యులు సునీల్ అన్నారు. కళ్లు తిరిగినట్లు, కాలు, చెయ్యి పని చేయకపోవడం, మాట తొత్తురబాటు వస్తే పక్షవాతం లక్షణాలు అని చెప్పారు.

బంద్ జయప్రదానికి ప్రచారం

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాల్లో చేర్చాలంటూ అసెంబ్లీ వైసిపి ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని కేంద్రానికి పంపడాన్ని నిరసిస్తూ గిరిజన సంఘాలు శుక్రవారం మన్యం బంద్‌నకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు బంద్ జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం చేశారు. మన్యం బంద్‌కు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు వంటి ప్రజాసంఘాలు కూడా సంఘీభావం తెలుపుతూ ప్రచారంలో పాల్గొన్నాయి.

సాలూరు : బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడానికి నిరసనగా శుక్రవారం చేపట్టనున్న మన్యం బంద్‌కు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరుణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు చెప్పారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను గురువారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులను మోసం చేయడం లో టిడిపి వైసిపి ఒకే విధానం అవలంభించాయని చెప్పారు. వైసిపి అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రామారావు పాల్గొన్నారు.

గిరిజన అభ్యుదయ సంఘం పిలుపు

జియ్యమ్మవలస : బోయవాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేసిన తీర్మానం వెనక్కి తీసుకోవాలని, సత్యపాల్ కమిటీ, శామ్యూల్ ఆనంద్ కుమార్ కమీటి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ రిపోర్టులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తలపెట్టిన మన్యం బంద్ కార్యక్రమం జయప్రదం చేయాలని గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరికి చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మండల, జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమానికి ఆదివాసీ సర్పంచ్‌లు, ఎంపిటిసి, జెడ్‌పిటిసిసభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు

మన్యం బంద్‌కు సహకరించాలని ఎస్ఐకు వినతి

కురుపాం : శుక్రవారం జరిగే మన్యం బందుకు సహకరించాలని నీలకంఠాపురం ఎస్సై డి. అనిల్ కుమార్‌కు ట్రైబల్ రైట్స్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఐ.రామకృష్ణ, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మధరావు వినతి పత్రం అందించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం 31న జరిగే మన్యం బంద్ చేపడుతున్న గిరిజనులకు పోలీసులు సహకరించాలని వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు.


ఎస్ఐకు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

జియ్యమ్మవలస : బంద్ ను జయప్రదం చేయాలని కోరుతూ జియ్యమ్మ వలస మండలం రావాడ రాంభద్రపురంలో గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం ఆధ్వర్యంలో పోస్టర్ విడుదలచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన తీర్మానానికి వ్యతిరేకంగా జరిగే బంద్ లో గిరిజనులంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు.

సంతలో ప్రచారం

కురుపాం : శుక్రవారం జరిగే మన్యం బంద్ ను జయప్రదం చేయాలని గురువారం కురుపాం సంతలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజన యువత సంతలో మన్యం బంద్ గోడ పత్రికలను విడుదల చేసి అనంతరం బంద్‌ను జయప్రదం చేయాలని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. బంద్‌లో యావత్ గిరిజన ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగనుంది. చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలని కమిషనర్ హెచ్ శంకరరావు ఒక ప్రకటనలో కోరారు.


వ్యక్తి అదృశ్యం

కొమరాడ :మండలంలోని అర్తంకు చెందిన భీమ వరపు శంకర రావు గత కొన్ని రోజులుగా కనిపించడంలేదని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని అతని తల్లి బీమవరపు దుర్గమ్మ కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు కూలి పని కోసం వెళ్లి తిరిగిరాలేదనీ తెలిపింది. ఇప్పటికే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆచూకీ తెలిస్తే ఫోన్ నెంబర్ 9963150194 కు తెలియజేయాలని కోరారు.



పారదర్శకంగా నియామకాలు జరపాలి

ప్రార్వతీపురంరూరల్ :ఐటిడిఎ పరిధిలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల నియామకాలు పారదర్శకంగా జరపాలని గిరిజన సంక్షేమసంఘం, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, పాలవలస భగవాన్ డిమాండ్ చేశారు. గురువారం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను కలిసి వినతి అందించినట్లు తెలిపారు. ఏకలవ్య నియామకాలకు డెమో చేసిన నవోదయ, సైనిక పాఠశాల ఉపాధ్యాయులతో డెమో నిర్వహించాలని కోరామని, డెమో పిఒ సమక్షంలో జరగాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. అనేక ఆరోపణలు ఉన్న ఇద్దరు గురుకుల ప్రిన్సిపాళ్లను నియామక ప్రక్రియలో లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.


పోస్టర్ విడుదల చేస్తున్న కళావేదిక సభ్యులు

శ్రీశ్రీ కళావేదిక వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

శ్రీశ్రీ కళావేదిక బ్రోచర్ గరుగుబిల్లి మండలం తోటపల్లి జట్టు ఆశ్రమంలో సాహితీ చైతన్య కిరణాలు ఉపాధ్యక్షులు పాలక దేవానంద్ ఆధ్వర్యంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హిందీ మంచ్ జాతీయ ప్రతినిధి మంచపల్లి శ్రీరాములు మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక వారు ఈనెల 9,10 తేదీల్లో కవితా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వేంకటేశ్వరుని సన్నిధిలో ఉత్సావాలు జరపడం ప్రపంచ కవులు పాల్గొనడం రికార్డని అన్నారు. పార్వతీపురం జిల్లాకు దేవానంద్ ప్రతినిధిగా ఉండి ఉత్సవాలకు పిలుపునిచ్చి,కవులను,రచయిత లను ప్రోత్సహించడం అభినందనీయమని తోటపల్లి జట్టు ఆశ్రమం ట్రస్ట్ అధ్యక్షులు డి.పారినాయుడు, విశ్రాంత ఎస్‌పి ఎల్‌వి శ్రీనివాస్, ధనుంజయ్ నాయుడు కొనియాడారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

జిల్లాలోని పలుచోట్ల శ్రీరామనవమి వేడుకలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో రామమందిరాలు భక్తులతో కిటకిలాడాయి.

కురుపాం : కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్రదేవ్ దంపతులు శ్రీరామనవమి సందర్భంగా కోట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి హెూమం కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండేలా కోరారు. ఈ కార్యక్రమంలో కురుపాం, శివన్నపేట గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కోలాటంతో మహిళలు ఆకర్షణ

గుమ్మలక్ష్మీపురం : శ్రీరామ నవమి వేడుకలు ఎల్విన్‌పేటలో కన్నుల పండువగా జరిగాయి. మొదట రోజు సీతారాముల కల్యాణం సందర్భంగా మహిళలు కలశాలు, కోలాటం నృత్యంతో అంగరంగ వైభవంగా వేడుకల్లో పాల్గొని పలువుర్ని ఆకట్టుకున్నారు. సీతారాములను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి శ్రీరామనవమి వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహణకు భక్తులు ఏర్పాటు చేస్తున్నారు.

జియ్యమ్మవలస : మండలంలో గ్రామ గ్రామాన ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు జరిగాయి. పెదమేరంగిలో అన్నదానం నిర్వహించారు.

పార్వతీపురంరూరల్ : శ్రీరామనవమి సందర్భంగా గురువారం పార్వతీపురం పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోను వేడుకలు అత్యంతవైభవంగా నిర్వహించారు. ని వెంకంపేట, చినమరికి వైకెఎంకాలనీ, నరిసిపురం ఎమ్మార్‌నగరం, తాళ్లబురిడి, బందలుప్పి గ్రామాలలో సీతారాములు కళ్యాణాలను నిర్వహించిన అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


గుమ్మలక్ష్మీపురంలో కోలాటం వేస్తున్న మహిళలు


పాచిపెంటలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వీరఘట్టం : మండలంలోని పాలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టం, వండువా, బీటివాడ, తలవరం, దశమంతపురం, కంబర తదితర గ్రామాల్లో భక్తులు రామాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీతానగరం : మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పలు రామ మందిరాల వద్ద సీతారామ కళ్యాణం చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బుడ్డిడిపేట, మరిపివలస, లక్ష్మీపురం, కృష్ణరాయపురం, బూర్జ తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాన్ని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సీతంపేట : మండలంలోని పులి పుట్టి సమీపంలో గల ముక్కండిపోలమ్మ దేవత వాల్మీకి వానవాసి శ్రేయోసంస్థ శ్రీరామగిరి క్షేత్రం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభోగంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంకూర్ నవీన్ పెంటయ్య, గంటా రామునాయుడు, నిమ్మక రామారావు, గేదెల ప్రసాదరావు, చిన్నందొర సౌజన్యకుమార్, భారతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిలో అలుపెరుగని పోరాటం

- ఇనుప సామగ్రి తయారీతో జీవనోపాధి
- మధ్యప్రదేశ్ నుంచి కురుపాంకు వలసజీవులు
- ఇంటిల్లిపాదీ ఇదే పనిలో...
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

'కోటి విద్యలు.. కూటి కొరకే అన్నట్లు వారికి తెలిసిన విద్య కేవలం ఉక్కుకు ప్రాణం పోయడం.. ఆ విద్యతోనే ఉక్కుతో వివిధ రకాల వస్తువులకు జీవం పోస్తూ గ్రామీణులకు తక్కువ ధరలకు విక్రయిస్తూ తమ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు ఆ మహిళలు. మగవారికి తామేమీ తీసిపోమంటూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. మధ్యప్రదేశ్ నుంచి పొట్ట చేతపట్టుకుని కురుపాం ప్రాంతానికి వలస వస్తూ మండుటెండలోనూ అగ్ని కొలిమిలో మగవారితో సమానంగా పనులు చేస్తూ తమ పిల్లల జీవనోభివృద్ధికి సహకారం అందిస్తున్న మహిళలు శభాష్ అనిపించుకుంటున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని రావడ జంక్షన్ వద్ద రోడ్డుపక్కనే మధ్యప్రదేశ్‌కు చెందిన 25 కుటుంబాలు పిల్లలతో పాటు సుమారు 50 మందికి పైగా ఏటా తమ బతుకు జీవనం కోసం వందల కిలోమీటర్లు దూరం దాటుకొని వలస వస్తుంటారు. ఈ క్రమంలోనే గత కొన్నిరోజుల క్రితం వలస వచ్చిన వీరు కురుపాంలో గల రావాడ జంక్షన్ దగ్గర రహదారికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని తమ కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఉక్కును కొనుగోలు చేసుకొని ఇనుప సామాన్లను తయారు చేస్తున్నారు. మగవారు బొగ్గులు వేసి కొలిమిలో ఇనుము కాల్చడం.. గడ్డపార, పార, కత్తులు, గొడ్డళ్ళు వంటి వస్తువుల తయారీకి అనుగుణంగా చేపడుతున్నారు. అయితే ఇందులో వారికి ప్రధాన పాత్రగా మహిళలు చేదోడుగా ఉండడం గమనార్హం. ఈ వస్తువులను తయారు చేసేందుకు బొగ్గును కాల్చేందుకు, గాలి కోసం యంత్రాన్ని తిప్పుతుంటే మహిళలు సంపిటితో తమ శక్తిసామర్థ్యాలతో కొడుతూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. భగభగమండే మండే ఎండలోనూ తమ పిల్లల కడుపు నింపడానికి తమ కష్టం సాధారణమేనని.. పిల్లల ఆకలి తీర్చడమే తమ కర్తవ్యమని చెబుతున్నారు. ఇలాంటి మహిళలు లక్షల్లో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. దేశంలో పేదల జీవప్రమాణాలు పెంచాలని పలు రాజకీయ పార్టీలు ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పించలేకపోవడం దారుణం. ఉపాధి కరువై రాష్ట్రాలు వదిలి మరొక రాష్ట్రానికి వలస వెళ్లి బతుకు జీవనం సాగి స్తున్నారు. మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన తాము ఇనుముతో కత్తులు, గొడ్డళ్లు మొదలగు వస్తువులను తయారు చేస్తున్నామని.. అయితే కొనుగోలుదారులు మాత్రం అంతంతం మాత్రమే ఉన్నారన్నారు. ధరలు లేకుండా తీవ్రంగా నష్టపోతూ రాత్రుల్లో రోడ్డు పక్కనే చిన్న పిల్లలతో పాటు ప్రమాదకర జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమను ప్రభుత్వం ఆదుకొని జీవనాధారం కోసం సాయం అందించాలని వారు కోరుతున్నారు. అధికారులు... ప్రజాప్రతినిధులు స్పందిస్తారని వేడుకొంటున్నారు.


ఇనుప సామాగ్రి పనుల్లో నిమగ్నమైన మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళలు

అభివృద్ధికి దూరంగా సప్పగూడ

నిత్యం వేధిస్తున్న నీటి కష్టాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పెద్దఖర్జ పంచాయతీ సప్పగూడ గిరిజన గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. ఈ గ్రామం ఏర్పడి 40 ఏళ్లయినా కనీస మౌలిక వసతుల్లేక గిరిజనుల తీవ్ర ఇబ్బందుపడుతున్నారు. తాగేందుకు నీరు లేక, పక్క గృహాలు మంజూరు కాక గిరిజనులు నానా అవస్థలు పడుతూ జీవన సాగిస్తున్నారు. గ్రామంలో 40 కుటుంబాలు ఉండగా 230 మంది వరకు జనాభా ఉన్నారు. అయితే ఈ గ్రామంలో బోర్లు లేకపోవడంతో కొండవాగు చలము, నేల బావి నీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వేసవి కాలం వచ్చిందంటే వాగు నీరు పూర్తిగా ఇంకిపోతుంది. మరోవైపు ఉన్న బావి నీరు కూడా అడుగంటి పోవడంతో తాగునీటి సమస్య తప్పడం లేదని గ్రామస్తుడు భీమారావు తెలిపారు. ప్రజల నిత్య అవసరాలకు, మధ్యాహ్న భోజనం నిర్వహణకు బావినీటిపైనే ఆధారపడుతున్నారు. పక్కా గృహాలు లేకపోవడంతో శిథిలమైన రేకిళ్లలోనే తల దాచుకుంటున్నారు. టిడిపి హయంలో రెండు పక్కా ఇళ్లు మాత్రమే నిర్మాణం జరిగిందన్నారు. సరేనా ఉపాధి లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐటిడిఎ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. గ్రామంపై ఐటిడిఎ అధికారుల దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


కనీస సౌకర్యాలకు నోచుకోని సప్పగూడ గ్రామం

గురువులను కించపరచడం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పదో తరగతి పరీక్షల్లో పొరపాటు చేసిన ఉపాధ్యాయులను ఈ ఏడాది టెన్త్ పరీక్షల సమయంలో తహశీల్దార్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శి పి.త్రినాథ్, మండల గౌరవాధ్యక్షులు ఎం.రామారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పరీక్షలలో మాల్ ప్రాక్టీసుకు సహకరించారని ఉపాధ్యాయులపై గతంలోనే చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ వారిని పరీక్ష ముగిసే వరకు తహశీల్దార్ వద్ద రిపోర్ట్ చేయాలని ఆదేశించడమంటే ఉపాధ్యాయులను ముద్దాయిలుగా చిత్రీకరించడమేనని చెప్పారు. పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్ సెల్‌ఫోన్ తీసుకురాకుండా నిబంధనలు అమలు పరచాలని కోరారు. అవసరమైతే పొరపాటు చేసిన ఉపాధ్యాయులకు పదో తరగతి ఇన్విజిలేషన్ డ్యూటీ వేయకుండా ఉండాలి తప్ప వారి మనోభావాలను దెబ్బతీయవద్దని విజ్ఞప్తిచేశారు.

నేరాలు ఘోరాలు


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలస్వామి

వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంరూరల్ : మండల కేంద్రంలోని తూముల అప్పల స్వామి అనే వృద్ధుడు మతిస్థిమితం లేకపోవడంతో విచిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. గురువారం అతని ప్రవర్తనతో కుటుంబసభ్యులు విసుక్కోవడంతో మనస్థాపం చెంది, ఇంట్లో ఉన్న పురుగుమంది తాగి ఆత్మ హత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో జిల్లా అస్పత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వేధింపులు తాళలేక మహిళ..

ప్రజాశక్తి-మక్కువ

మండలకేంద్రంలోని స్థానిక పిహెచ్‌సి సమీపంలో నివాసముంటున్న శ్రీకాకుళం కనకమహాలక్ష్మి ..భర్త శ్రీనివాసరావు వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఉన్న చీమల మందును తాగడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఆమెను పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతుంది. కనక మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు భర్త శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

పార్వతీపురంరూరల్ : మక్కువ మండలం మార్కొండపుట్టికి చెందిన లావేటి పోలినాయుడు, ఆతని వదినతో కలసి గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై పార్వతీపురం వస్తుండగా వెంకంపేట ఘోరీల దగ్గర ఎదురుగు వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 వాహనంలో జిల్లా అసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.